# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



సంపుటి : 2 సంచిక : 297 శుక్రవారం 07 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# ప్రమాదంలో బీఆర్ఎస్!



- కేసీఆర్ నియంత పోకడలే పార్టీకి నష్టం కలిగించాయా..!
- సార్.. 16 అన్నారు.. 9 సీట్లతోనే సరిపెట్టుకున్నారు.
- మూడో సారి కూడా అధికారం మనదే అన్నారు
- సీన్ కట్ చేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో బోల్తా కొట్టింది
- ఇప్పుడు ఆ పార్టీ ఉనికి ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది.

హైదరాబాద్

కారు.. సార్.. 16 అన్నారు.. 9 సీట్లతోనే సరిపెట్టుకున్నారు. ఆ తర్వాత పార్టీ పేరును మార్చుకున్నారు. కేసీఆరే ప్రధాని కవాలన్నారు. దేశ్ కీ నేత అన్నారు. ఏపీతో పాటు మహారాష్ట్రలో కూడా పార్టీని విస్తరించారు. మూడో సారి కూడా అధికారం మనదే అన్నారు. సీన్ కట్ చేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో బోల్తా కొట్టింది. ఇక లోక్ సభ ఎన్నికల్లో కనిపించకుండా పోయింది. ఇప్పుడు ఆ పార్టీ ఉనికి ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. తెలంగాణలో బీఆర్ఎస్ పతనానికి కారణమేంటి. టీఆర్ఎస్ తెలంగాణ స్వరాష్ట్రం కోసం స్థాపించిన పార్టీ. 2014 విజయం తర్వాత అధికారం చేపట్టింది. అయితే ఎంతో మంది ఉద్యమకారులను కాదని.. సమైక్య ఆంధ్ర కోసం పోరాడిన వారిని పార్టీలోకి తీసుకుంది. వారికి మంత్రి పదువులు ఇచ్చింది. తుమ్మల నాగేశ్వర రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మైనంపల్లి హనుమంత రావు ఇలా చాలా మందిని పార్టీలో చేర్చుకుంది. కానీ ఎప్పటి నుంచి పార్టీ కోసం పని చేసిన వారికి అన్యాయం చేసింది. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ, కుల పెత్తనం కొనసాగింది. తండ్రి సీఎం, కొడుకు మినిస్టర్, అల్లుడు మినిస్టర్, బిడ్డ ఎంపీ, కులపోళ్ల ఎమ్మెల్యేలు. అయినప్పటికీ సంక్షేమ పథకాలు టీఆర్ఎస్ ను 2018లో గట్టెంకించాయి. ఆ తర్వాత అవినీతి పెరగడం, కేసీఆర్ నియంతృత్వ నిర్ణయాలు పార్టీకి నష్టం కలిగేలా చేశాయి. ముఖ్యంగా పార్టీ పేరు మార్చడం ఆ పార్టీ చేసిన పెద్ద తప్పుగా రాజకీయ విశ్లేషకులు - మిగతా3లో




## కాంగ్రెస్‌తో టచ్‌లో..

# 10 మంది

- పార్టీ మారేందుకు ముఖ్య నేతలతో మంతనాలు
- సీఎం రేవంత్, వేం నరేందర్‌తో సంప్రదింపులు
- గ్రేటర్ హైదరాబాద్ పరిధి శాసనసభ్యులే అధికం
- టీడీపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లినవారే
- ఈ నెలాఖరులోగానే ఎక్కువమంది ఫిరాయింపు

# టీటీడీపీకి పూర్వ వైభవం!

- తెలంగాణలో టీడీపీ కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించిన చంద్రబాబు
- తెలంగాణలో పార్టీని పునర్నించాలనే నిర్ణయానికి వచ్చిన చంద్రబాబు
- బీఆర్ఎస్ స్థానాన్ని తెలుగుదేశం భర్తీ చేసేలా చంద్రబాబు ప్రణాళికలను సిద్ధం
- త్వరలోనే తెలంగాణ పార్టీ నేతలతో మరోసారి చంద్రబాబు




హైదరాబాద్

ఏపీ ఎన్నికల్లో చరిత్రాత్మకమైన విజయాన్ని సొంతం చేసుకున్న తెలుగుదేశం–జనసేన–బీజేపీతో కూడిన ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతోంది. తెలుగుదేశం పార్టీకి 135, జనసేనకు 21, బీజేపీకి 3 సీట్లు రాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 సీట్లు దక్కాయి. లోక్ సభ ఫలితాల్లో టీడీపీకి 16, జనసేనకు 2, బీజేపీకి 3, వైసీపీకి 4 వచ్చాయి. ఏపీకి ముఖ్యమంత్రిగా ఈనెల 12వ తేదీన మరోసారి ప్రమాణస్వీకారం చేయబోతున్న చంద్రబాబు తన దృష్టిని తెలంగాణపై సారించారు. ఆ రాష్ట్రంలో కూడా పార్టీని బలోపేతం చేయడానికి మాస్టర్ ప్లాన్ ను అమలు చేయబోతున్నారు. టీడీపీకి పూర్వ వైభంపై దృష్టి తెలంగాణలో పార్టీని పునర్నించాలనే నిర్ణయానికి వచ్చిన చంద్రబాబు తెలంగాణకు చెందిన నేతలతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడంపై దృష్టిపెడతానని హామీ ఇచ్చారు. తాజాగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చెరో 8 స్థానాలను దక్కించుకోగా హైదరాబాద్ నుంచి ఎంఐఎం విజయం సాధించింది. ప్రస్తుతం తెలంగాణలో కేసీఆర్ ఆధ్వర్యంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ప్రాంతీయ వాదంతోపాటు సెంటిమెంట్ రాజకీయాలు ప్రస్తుతం - మిగతా3లో



## మోదీ, షా స్టాక్ కుంభకోణం

- అమాయక మదుపరులను నిండా ముంచారు
- నిజాలు దాచి అబద్ధాలు ప్రచారం చేశారు
- ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను మ్యానిపులేట్ చేశారు
- 4న ఏర్పడ్డ స్టాక్ మార్కెట్ నష్టాలపై దర్యాప్తు చేయాలి
- కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్

# కోడ్ ముగిసింది

- ప్రభుత్వ పాలనకు తొలగిన అడ్డంకి
- త్వరలోనే భారీ ఎత్తున అధికారుల బదిలీలు
- పాలనలో కాంగ్రెస్ ముద్రకు రేవంత్ కసరత్తు
- సీఎం చెబితే కానీ ఫైళ్లు కదలని పరిస్థితి
- ముఖ్యమంత్రి కార్యాలయంలోనూ మార్పులు
- ప్రజా సంబంధాల విభాగంలోనూ ప్రక్షాళన

వేగంగా సంక్షేమ పథకాల అమలుకు చర్యలు

- ఆర్థిక శాఖ బాధ్యతలు విక్రమార్కకు?
- చంద్రబాబుకు రేవంత్ ఫోన్.. అభినందనలు




హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసింది. ఎన్నికల క్రతువు పూర్తయి పాలనకు వేళయింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు దాదాపు ఏడు నెలల్లో మూడు నెలల పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉండటంతో పెద్దగా ప్రభుత్వ కార్యకలాపాలు సాగలేదు. సంక్షేమ పథకాలూ ఆశించిన స్థాయిలో అమలు కాలేదు. గురువారంతో కోడ్ ముగియడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించారు. ముందు క్షేత్రస్థాయి ఉద్యోగులు మొదలు ఐఏఎస్‌ల వరకు పెద్ద ఎత్తున బదిలీలు చేయనున్నారు. బదిలీల అనంతరం అధికారులందరికీ ప్రభుత్వ ప్రాధాన్యతలు, పథకాల అమలుకు తీసుకోబోయే చర్యలపైౖ దిశా నిర్దేశం చేస్తారు. ఉమ్మడి రాష్ట్ర ఆస్తుల పంపకం వివాదాలపైనా అధికారులతో చర్చించనున్నారు. మొత్తం మీద రాష్ట్రంలో - మిగతా3లో

# కొత్త టీంపై కసరత్తు

- కేబినెట్‌లో 50 మందికిపైగా చాన్స్.. నడ్డా నివాసంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతల భేటీ
- పలువురు పాత మంత్రులకు ఉద్వాసన.. నిర్మలా సీతారామన్‌కు అనుమానమే
- మిత్రపక్షాలకు ఆర్థిక, హోం, రక్షణ, విదేశాంగ, వాణిజ్య మినహా ఇతర శాఖల కేటాయింపు!
- మహిళా కోటాలో డీకే అరుణ, పురందేశ్వరి..
- పరిశీలనలో కిషన్‌రెడ్డి, సంజయ్, ఈటల
- ఎల్లుండి ప్రధానిగా మోదీ ప్రమాణం.. పలువురు మంత్రులు కూడా..
- బంగ్లాదేశ్, శ్రీలంక దేశాధినేతలకు ఆహ్వానం..
- హాజరుకానున్న చంద్రబాబు, నితీశ్ తదితరులు
- నేడు ఎన్డీయే ఎంపీల సమావేశం.. ఢిల్లీలో బాబు.. కొనసాగుతున్న మంతనాలు
- రాష్ట్రపతిని కలిసిన కేంద్ర ఎన్నికల కమిషనర్లు.. ఎన్నికైన ఎంపీల జాబితా అందజేత



# సమాజ సేవలో మేడిపల్లి ఆర్యవైశ్యులు






**ప్రతినెల అన్నదానం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న టిపిసిసి అధికార ప్రతినిధి కల్వ సుజాత గుప్త**

మేడిపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గత 15 నెలల నుండి ప్రతి అమావాస్య రోజు అన్నదానం కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మేడిపల్లిలో గురువారం అమ్మ పెద్ది లక్ష్మి ,పెద్ది గిరీష్ కుమార్ - రేణుకాదేవి,కూతురు శ్రీజ శ్రేష్ట వారి కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం సుమారు 800 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి తెలంగాణ ఆర్యవైశ్య చైర్మన్ కల్వ సుజాత గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొని మేడిపల్లి ఆర్యవైశ్యులను అభినందించారు. ఈ సందర్భంగా కాల్వ సుజాత గుప్త మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని అతి త్వరలో ఆర్యవైశ్య కార్పొరేషన్ తొలి మహిళా చైర్మన్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్య వైశ్యులు ప్రజాసేవలో ముందుంటారని,నిరంతరం ప్రజా శ్రేయస్సు కోరుకునే ఆర్య వైశ్యులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు తన సహాయ సహకారాలు ఉంటాయని, సుదీర్ఘకాలంగా అన్నదానం నిర్వహిస్తున్న మేడిపల్లి ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సకినాల వెంకటయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి కోకల ప్రకాష్ గుప్తా,కోశాధికారి ఎరుకుల రాంబాబు గుప్త, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దళిత కార్పొరేటర్ పై అధికార పార్టీ కుట్ర





**కాంగ్రెస్ పార్టీలో చేరనందుకే కార్యాలయం కూల్చివేతకు యత్నం**

**13 ఏళ్లుగా ఉన్న కార్యాలయం నేడు అక్రమమా?**

**అధికారుల తీరుపై బండారి మంజుల రవీందర్ ఆవేదన**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బండారి రవీందర్,15వ డివిజన్ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ గత 13 సంవత్సరాల క్రితం నిర్మించి తమ కార్యాలయంగా వినియోగిస్తు డివిజన్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని, అకస్మాత్తుగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అక్రమ నిర్మాణమని కార్యాలయం కూల్చే ప్రయత్నాలు చేశారు. ఈ సందర్భంగా బండారి రవీందర్,స్థానిక కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్, మున్సిపల్ అధికారులను వివరణ అడగగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. ఈ సందర్భంగా బండారి రవీందర్ మాట్లాడుతూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయని, పీర్జాదిగూడ మేయర్ పదవి కోసం కొందరు కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ కార్పొరేటర్లను వివిధ రకాలుగా ప్రలోభ పెడుతూ, భయపెడుతూ కాంగ్రెస్ లోకి చేర్చుకున్నారని అదే సమయంలో తమకు కూడా కాంగ్రెస్ నాయకులు సంప్రదించిన బిఆర్ఎస్ పార్టీని వీడేది లేదని చెప్పడంతో, నాటి నుండి కాంగ్రెస్ నాయకులు వివిధ రకాల కుట్రలు కుతంత్రాలు టిఆర్ఎస్ కార్పొరేటర్ లను భయపెడుతున్నారని, నీతి నిజాయితీగా ప్రజా సేవ చేస్తున్న ఒక దళిత కార్పొరేటర్ కార్యాలయం కుట్రలు చేయడం సరికాదని, సంబంధిత అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారకుండా నిజానిజాలు పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన నోటీసులో 15 రోజుల గడువు ఉందని, తమ అందుబాటులో లేని సమయంలో మూడు రోజులు గడవకముందే తన కార్యాలయానికి కూల్చే ప్రయత్నం అధికారులు చేయడం న్యాయం కాదని, తనకిచ్చిన 15 రోజుల గడువు లోపు సంబంధిత పత్రాలు కమిషనర్ కు అందిస్తానని బండారి రవీందర్ స్పష్టం చేశారు.

# ప్రారంభమైన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట

**చదువుకు దూరమైన పిల్లలను ఈ నెల 19 లోపు బడిలో చేర్పించాలి.**

**శంషాబాద్ మండలంలోని నర్కుడలో ప్రారంభం.**

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక.**







: మానవీయ కోణంలో ఆలోచించి బడి ఈడుకు దూరమైన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంలో ప్రతి ఒక్కరు భాధ్యత తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక ముఖ్యఅతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలనే సంకల్పంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రభుత్వం ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. చదువుకు దూరమైన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడమే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ఈబడిబాట కార్యక్రమంను జిల్లా యంత్రాగం సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. బడి బయట పిల్లలను గుర్తించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్య అనేది ప్రాథమిక హక్కు అని, విద్య ఉంటే మనం ఎక్కడికైన వెళ్లగలమనీ, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలన్నారు. రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ కు సమీపాన ఉన్నందున వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలో నిర్మాణాలు అధికంగా చేపట్టడం జరుగుతుందని, నిర్మాణాలు జరుగుతున్న పరిసరాలలో పని చేస్తున్న పిల్లలను గుర్తించి వారందరినీ బడుల్లో చేర్పించాలని టీచర్లకు సూచించారు. అంగన్ వాడిలో చదువుతున్న 5 సంవత్సరాల వయస్సు పైబడిన పిల్లలందరని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అంగన్ వాడి టీచర్లు కృషి చేయాలన్నారు. చదువు లేని వారు కుటుంబానికి, సమాజానికి ఎంత భారమో తెలియచేసి బడులలో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. చదువుకున్న వారే భవిష్యత్తులో ఏదైన సాధించగలరని తెలిపారు. ప్రభుత్వ బడులలో చదువుకున్నవారు ఉన్నత స్థానాలలో ఉన్నారని తెలిపారు. మనం రోజు పేపర్లలో చూసే రాజకీయ నాయకులు, ఉన్నత స్థానాల్లో ఉన్న అధికారులు ప్రభుత్వ బడులలో చదువుకున్న వారేనని గుర్తు చేశారు. ప్రభుత్వ బడులలో ఉన్నత చదువులు చదివి, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. మనం ఎక్కడ పుడతామో, ఎక్కడ పేరుగుతామో మన చేతులలో ఉండదని, మనం ఏ స్థాయికి చేరుకోవాలనేది మాత్రం కచ్చితంగా మన చేతులోనే ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు పై విద్యార్థులకు అవగాహన కల్పించి వారు ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పదవ తరగతిలో 9.7% సాధించిన నర్కుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కార్తీక, వీణా, అనుష్క, లను కలెక్టర్ సత్కరించారు. విద్యార్థులు బాగా చదివి వారి తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యశాఖ అధికారి సుశీందర్ రావు, శంషాబాద్ తహాసిల్దార్ నాగమణి, ఎంపిడీఓ మున్నీ. ఐసిడీస్ సీడీపీఓ షబానా, ఎమ్ఈఓ రాంరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్ వాడి టీచర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత



అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఆవులను పట్టుకున్న సంఘటన గురువారం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..మల్లేపల్లి సంతలో రమేష్, కే నరేందర్ 14 ఆవులను కొనుగోలు చేశారు. వాటిని ఐషర్ వాహనంలో డ్రైవర్ సిగ శివతో కలిసి హైదరబాద్లోని బహదూర్పుర కబేళాకు తరలిస్తుండగా... ఉదయం 9 గంటల సమయంలో మాల్ చెక్పోస్టు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అక్రమంగా 14 ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించి, పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మహిళా సంఘాల పనితీరు బాగుంది.

**మహిళ సంఘాల ఆర్థిక అభివృధి, చేకూర్పు మెరుగుగా ఉంది.**

**సంతోషం వ్యక్తం చేసిన ఎన్.ఐ.ఆర్.డి బృందం.**





మహిళా సంఘాల ఆర్థిక అభివృధి, చేకూర్పు మెరుగుగా ఉందని ఎన్.ఐ.ఆర్.డి బృందం సంతోషం వ్యక్తం చేశారు. మహేశ్వరం మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని యన్.ఐ.ఆర్.డి. నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రాజెక్ట్ మేనేజర్లు, జిల్లా మేనేజర్లు సందర్శించారు. సంఘాలు గురించి వివరాలు అడిగి తెలుసుకోగా మహేశ్వరం ఎం.పి.డి.ఓ. శైలజ, ఏపీఎం సత్యనారాయణ సంఘాలపై వారికి పూర్తి అవగాహన కల్పించారు. మహిళ స్వయం సహకార సంఘాలు, బ్యాంకు ద్వారా లోన్లు తీసుకొని జీవనోపాదులు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. సంఘాల పనితీరు, గ్రామ సంఘాల పనితీరు స్వయం సంఘాల సభ్యుల గురించి వివరించారు. ఆనంతరం బ్యాంకు లింకేజి ద్వారా లోన్ తీసుకొన్న ఎంటర్ ప్రజెస్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్.ఐ.ఆర్.డి బృందం వివరాలు తెలుసుకున్న అనంతరం చిన్న సంఘాలు. గ్రామ సంఘం, మండల సమాఖ్య పుస్తక నిర్వహణ చాలా బాగుంది అన్నారు. ఇలాంటి కార్యక్రమలు మా రాష్ట్రాలలో ఏర్పాటు చేసుకుంటామని చెప్పారని ఎంపిడిఓ శైలజ తెలిపారు. ఈ సందర్శనలో ఎన్.ఐ.ఆర్.డి. మేనేజర్ అభిషేక్, సేర్ప్ ప్రాజెక్టు మేనేజర్లు వీరమల్లు, వెంకట్, వివిధ రాష్ట్రాల మేనేజర్లు, సిసి లు సురేష్, యాదయ్య, నర్సింగ్ రావు, మహేశ్వరం మండల మహిళా సమాఖ్య అద్యక్షురాలు కవిత, అకౌంటెంట్ మాధవి, కంప్యూటర్ ఆపరేటర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు లోకి ఓసి కన్వేయన్స్ డ్రైవర్లు చేరిక

: మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ ఓసి లో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్ల




జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీ ఐ టీ యు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం కన్వేయన్స్ డ్రైవర్లు సిఐటియు యూనియన్ లోకి చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డ్రైవర్లకు కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కన్వేయన్స్ డ్రైవర్లకు సీఎం పిఎఫ్ అమలు చేసే విధంగా యాజమాన్యం చొరవ తీసుకోవాలని, అదేవిధంగా గత సంవత్సరం 15% కట్ చేసిన డబ్బులను కార్మికుల అకౌంట్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతినెల 7వ తారీఖున వేతనాలు చెల్లించాలని, డ్రైవర్లు అందరికీ ఆసుపత్రి బుక్స్ అమలు చేసే విధంగా యాజమాన్యం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో కన్వేయన్స్ డ్రైవర్ మందమర్రి డివిజన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కే తిరుపతి, యు. రవి, ఎం.డి చాంద్ పాషా, కుమారస్వామి, ఎం రమేష్, బి వెంకటేష్, ఎం.డి రాజ్ మహమ్మద్, సాజిత్, కే.తిరుపతి, ఏ.రాజు, ఎం. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బోడుప్పల్ బిజెపి నేతలు**

**తన జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గం కంటెస్టెంట్ కార్పొరేటర్ ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వందలాది మంది యువకులు రక్తదానం చేశారు. కోటి కాంతుల చిరునవ్వులతో నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో ఆరోగ్యంగా ఉంటూ రాబోయే కాలంలో ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుకుంటూ పలువురు బిజెపి నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డిని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ బిజెపి అధ్యక్షులు గొని శ్రీనివాస్,బిజెపి నాయకులు తుప్పత్ ఆనంద్,సాయి నరేంద్ర,పురుషోత్తం ,సతీష్, చంద్రశేఖర్ ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# 2018- 2024
# 7 శాతం నుంచి 21 శాతానికి ఓటింగ్ షేర్



**హైదరాబాద్ :** తెలంగాణలో కదనోత్సాహంతో ఉంది కమలదళం. అధికారమే తరువాయి అంటూ ట్వంటీ ట్వంటీ ఎయిట్ టార్గెట్ పెట్టుకుంది. రాష్ట్రంలో ఎన్నిక ఎన్నికకీ ఓట్లు, సీట్లు పెంచుకుంటున్న బీజేపీ.. డబుల్ డిజిట్ కాకపోయినా గతకంటే డబుల్ ఎంపీ సీట్లలో విజయబావుటా ఎగురవేసింది. 8 ఎంపీ స్థానాలతో అధికార కాంగ్రెస్ పార్టీకి దీటైన పోటీ ఇచ్చింది. ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగాం.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పగ్గాలు చేపడతామన్న ధీమాతో వ్యూహాలకు పదునుపెడుతోంది కాషాయ పార్టీ.తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ అంచనాలకు తగ్గట్లే పర్‌ఫామ్ చేసింది. డబుల్ డిజిట్ సీట్లు టార్గెట్‌గా బరిలోకి దిగిన రాష్ట్ర నాయకత్వం ఆ మేజిక్ సాధించలేకపోయినా.. గతంకంటే రెట్టింపు సీట్లు గెలిచి రాష్ట్రంలో ప్రత్యామ్నాయశక్తిగా నిరూపించుకుంది. గతంలో ఒక అసెంబ్లీ స్థానంతో పాటు నాలుగు ఎంపీ సీట్లు గెలుచుకున్న బీజేపీ.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 8 అసెంబ్లీ స్థానాలతో పాటు.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అధికారపార్టీతో సరిసమానంగా 8 ఎంపీ సీట్లు గెలిచింది. దీంతో తాము కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయ శక్తిగా నిలిచామని, ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పగ్గాలు తమ చేతికొస్తాయన్న ధీమా బీజేపీలో కనిపిస్తోంది.పెరిగిన సీట్లతో పాటు ఓట్ల శాతం కమలం శ్రేణుల్లో జోష్ నింపింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఎమ్మెల్యే స్థానాలు దక్కకపోయినా..ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పోరాటపటిమ చూపించి తెలంగాణలో బీజేపీ మరింత పట్టు సాధించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి 7 శాతం ఓట్లొస్తే ఒకే ఒక్క ఎమ్మెల్యే గెలిచారు. ఏడాదితిరిగేలోపే 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి 19 శాతం ఓటింగ్‌తో ఆ పార్టీ నుంచి ఏకంగా నలుగురు ఎంపీలు గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 14 శాతం ఓట్లు సాధించిన బీజేపీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఓటింగ్ ఏకంగా 21 శాతానికి పెరిగింది. ఆ పార్టీనుంచి ఎనిమిది ఎంపీలు గెలిచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సాధించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని బీజేపీ నాయకత్వం ప్లాన్ చేస్తోంది.రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గత బీఆర్‌ఎస్ పాలననే తలపిస్తోందని.. హామీల అమలులో ఇప్పటికే కాంగ్రెస్ వైఫల్యం చెందిందని ఆరోపిస్తున్నారు బీజేపీ నేతలు. హామీల అమలుకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారో కూడా చెప్పలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉందని కమలం నేతలు టార్గెట్ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ఊపుతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్యం సాధించే దిశగా కార్యాచరణ రూపొందించుకునేందుకు సిద్ధమవుతున్నారు. బీజేపీ అగ్ర నాయకత్వం కూడా దక్షిణాదిపై ఫోకస్ పెట్టడంతో.. కేంద్రంలో కొలువుదీరనున్న ఎన్డీయే సర్కారులో రాష్ట్ర బీజేపీ ఎంపీలకు రెండు మూడు కేంద్రమంత్రి పదవులు దక్కే అవకాశం కనిపిస్తోంది.గత బీఆర్‌ఎస్ పాలనను టార్గెట్ చేసి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలనుకుంది బీజేపీ. షన్ రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి రెండోసారి విజయం సాధించడమేకాకుండా.. మంచి స్ట్రాటజీతో.. పర్ఫెక్ట్ క్యాండిడేట్ సెలక్షన్‌తో మిగిలిన నియోజకవర్గాల్లోనూ సత్తా చూపించారు. మల్కాజ్‌గిరి, చేవెళ్ల, మెదక్, మహబూబ్‌నగర్ స్థానాలను కైవసం చేసుకోవడంలో కిషన్ కీలకపాత్ర పోషించారు. బూత్‌స్థాయి నుంచి కేడర్‌ను ఉత్తేజపరుస్తూ.. వారికి దిశానిర్ధేశం చేస్తూ ముందుకెళ్లారు కిషన్. పదేళ్ల క్రితం బీజేపీ పరిస్థితికి.. ఇప్పుడు ఆ పార్టీ పరిస్థితికి చాలా తేడా ఉంది. అప్పుడు అసెంబ్లీలోనే ఒక సీటు సాధించేందుకు తంటాలుపడ్డ కాషాయపార్టీ.. ఇప్పుడు గౌరవప్రద స్థానంలో నిలిచింది.. నరేంద్రమోదీని, అభివృద్ధిని చూసి మరోసారి పట్టం కట్టారంటూ కిషన్ రెడ్డి తెలిపారు. తొలిసారిగా తెలంగాణలో 8 స్థానాలు గెలిచి రికార్డు సాధించామన్నారు. డబుల్ డిజిట్ రావాలన్న ఆకాంక్షతో పనిచేశామని.. రెండు, మూడు స్థానాల్లో గెలివాల్సి ఉందని.. కానీ కొన్ని కారణాలతో ఓడిపోయామని తెలిపారు.అయితే ఆశించిన స్థాయిలో ఎమ్మెల్యేలు గెలవకలేపోయినా .. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావమే చూపింది. ఈ ఫలితాలతో రానున్న కాలం తమదేనని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామన్న నమ్మకంతో ఉంద బీజేపీ నాయకత్వం. అధికార పగ్గాలు చేపట్టి తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తామని ఇప్పటినుంచే ధీమా వ్యక్తంచేస్తున్నారు కమలనాథులు.

# కోడ్ ముగిసింది..

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ మార్క్ పాలన కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

**అధికారుల బదిలీలు**

డిసెంబరులో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. మార్చిలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దాంతో శాసనసభ ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి అవకాశం లేకపోయింది. ఇదే విషయాన్ని సీఎం రేవంత్, మంత్రులు ఎన్నికల ప్రచారంలో చెప్పారు. గురువారంతో ఎన్నికల కోడ్ ముగియడంతో సీఎం బదిలీలపై దృష్టి సారించారు. ఆర్నెల్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పెద్దగా అధికారులు బదిలీలు చేయలేదు. ఈసారి భారీగానే బదిలీలు ఉంటాయని భావిస్తున్నారు. సీఎంవోలోనూ మార్పులు ఉండవచ్చని సమాచారం. వివిధ ప్రాంతాలు, పలు విభాగాల్లో ఒక్కొక్కరినీ తీసుకొచ్చి సీఎంవోలో ఓఎస్డీలు, సెక్రటరీలుగా నియమించి, పలు శాఖల బాధ్యతలను అప్పగించారు. సీఎం ఆశించినస్థాయిలో వారి పనితీరు లేదని, ముఖ్యమంత్రి చెబితే తప్ప ఫైలు కదలని పరిస్థితి ఉందనే ప్రచారం సచివాలయ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది. ముఖ్యమంత్రి ప్రజా సంబంధాలను పర్యవేక్షించే విభాగంలోనూ కీలక మార్పులు ఉండే అవకాశం ఉన్నదని సమాచారం. కేంద్రంలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం జూన్ చివరివారంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అందులో రాష్ట్రానికి వచ్చే గ్రాంట్లు, నిధులు పరిశీలించిన తర్వాత జూలై రెండు లేదా మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలను నిర్వహించి పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలనే యోచనలో రేవంత్ ఉన్నట్లు సమాచారం. మరోవైపు "ప్రజాపాలన"లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. అర్హులైన వారికి పథకాలు అందించాలని భావిస్తున్నారు. ధరణి పోర్టల్‌లో తలెత్తిన సమస్యలనూ త్వరితగతిన పరిష్కరించాలని సీఎం భావిస్తున్నారు. మూసీ నది సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులను త్వరితగతిన పట్టాలెక్కించేలా అధికారులకు సీఎం సూచనలిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు, పలు ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన బడ్జెట్ పైనా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఆగష్టు 15 లోగా రూ.2 లక్షల మేర రుణ మాఫీ చేస్తామని హామీనిచ్చిన నేపథ్యంలో నిధుల సమీకరణపై దృష్టి సారించారు.



**ఉమ్మడి ఆస్తులు, భూములపై నిర్ణయం**

పదేళ్లుగా ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ జూన్ 2 నుంచి కేవలం తెలంగాణ రాజధానిగా మారిపోయింది. ఉమ్మడి ఆస్తుల విభజన మాత్రం పూర్తి కాలేదు. విభజన చట్టం షెడ్యూల్ 9, 10లో చేర్చిన ఆస్తులు, భూముల పంపకాలపై ఇరు రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హెూల్డింగ్ లిమిటెడ్ పరిధిలోని విలువైన భూములు షెడ్యూల్ 9, 10లో ఉన్నాయి. వీటిపైనా ఒక నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వానికి నిధులపరంగా వెసులుబాటు వస్తుంది.

**వికాసరాజ్‌కు ఆర్థిక శాఖ?**

కేంద్ర ఎన్నికల సంఘం ఆధీనంలోని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈఓ) కార్యాలయంలో పని చేస్తున్న ముగ్గురు రాష్ట్ర కేడర్ ఐఏఎసలలో కనీసం ఇద్దరిని తిరిగి ప్రభుత్వంలోకి తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోంది. ముగ్గురికీ సిన్సియర్ అధికారులుగా పేరు ఉండడమే కాకుండా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎలాంటి మచ్చ పడకపోవడంతో వారిని ప్రభుత్వంలోకి తీసుకుని, కీలక బాధ్యతలు అప్పగించాలని యోచిస్తోంది. పార్లమెంటు ఎన్నికలు ముగియడం, ఇప్పట్లో కీలక ఎన్నికలు లేకపోవడంతో ఆ ఐఏఎసలను తిరిగి ప్రధాన స్రవంతిలోకి తీసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం కూడా అనుమతిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సీఈవో వికాసరాజ్‌ను మళ్లీ ప్రభుత్వంలోకి తీసుకొని, ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించవచ్చన్న చర్చ జరుగుతోంది. సీఈఓ కార్యాలయంలో 2003 బ్యాచ్‌కు చెందిన డీఎస్ లోకేషకుమార్ అదనపు సీఈఓగా, 2009 బ్యాచ్‌కు చెందిన సర్ఫరాజ్ అహ్మద్ జాయింట్ సీఈఓగా పని చేస్తున్నారు. వీరిద్దరినీ తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. లూప్ లైన్‌లో ఉన్న అధికారుల్లో ఒకరిని సీఈవోగా నియమించే అవకాశం ఉంది.

# నీట్ యూజీలో 'శ్రీచైతన్య' సరికొత్త రికార్డు

హైదరాబాద్ : నీట్ యూజీ 2024 ఫలితా ల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు సరికొత్త రికార్డు నెలకొల్పినట్టు డైరెక్టర్ సుష్మ తెలిపారు. 720/720 మార్కులతో ఓపెన్ క్యాటగిరీలో 9 ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించి శ్రీచైతన్య అధిపత్యాన్ని కొనసాగించిందని పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 1వ ర్యాంకు వీ కళ్యాణ్, పీ పవన్ కుమార్ రెడ్డి, ముఖేశ్ చౌదరీ, భానుతేజసాయి, ఇరాన్ ఖ్వాజీ, దర్శ్ పగ్దార్, ఇషా కొఠారీ, ఆదర్శ్ సింగ్ మోయల్, అమీనా ఆరిఫ్ వరుసగా 9 తొలి ర్యాంకులు సాధించారని తెలిపారు. 715 మార్కులతో 30 మంది, 710 మార్కు ల పైన మరో 57మంది, 700 మార్కులపైన 132 మంది, 650 మార్కులపైన 852 మంది శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారని వివరించారు. ఈ అద్భుత విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సుష్మ అభినందనలు తెలిపారు.




## ప్రమాదంలో బీఆర్ఎస్!

-మొదటిపేజీ తరువాయి

అంచనా వేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 39 సీట్లకే పరిమితం అయింది. ఇక ఇప్పుడు జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఒక్క సీటు అంటే ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. పార్టీ స్థాపించిన నుంచి ఇప్పటి వరకు ఎదో చోట బీఆర్ఎస్ గెలుస్తూ వస్తోంది. కానీ ఇప్పుడు ఒక్క సీటు కూడా గెలవలేక నాలుగో స్థానానికి పడిపోయింది. దీంతో బీఆర్ఎస్ కథ ముగిసిందని చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు. కేసీఆర్ ఇంకా నియంత పోకడలతో, కుటుంబ పెత్తనంతో, తన కులానికే ప్రాధాన్యం ఇస్తే.. ఆ పార్టీ భూస్థాపితం అవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

## టీటీడీపీకి పూర్వ వైభవం!

-మొదటిపేజీ తరువాయి

నడవకపోవడం ఆ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పార్టీ పేరు మార్చడం కూడా బీఆర్ఎస్ కు కలిసిరావడంలేదు. ఆ పార్టీ నేతలు ఇతర పార్టీలవైపు చూస్తున్నారు. బీఆర్ఎస్ స్థానం భర్తీ చేసేలా.. బీఆర్ఎస్ స్థానాన్ని తెలుగుదేశం భర్తీ చేసేలా చంద్రబాబు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ పార్టీని నేతలు వీడిపోయారుకానీ కార్యకర్తలు వీడలేదు. వారంతా అలాగే ఉన్నారు. ఈ సమయంలో పార్టీ ఎదుగుదలపై దృష్టిపెట్టడం సరైన నిర్ణయమని ఆయన భావిస్తున్నారు. కేంద్రంలో కూడా తెలుగుదేశం మద్దతు కీలకం కావడంతో బీఆర్ఎస్ లోకి వెళ్లిన టీడీపీ నేతలంతా భవిష్యత్తు కోసం ఆలోచించి తిరిగి టీడీపీలోకి వస్తారనే అంచనాలున్నాయి.

దీనిపై త్వరలోనే తెలంగాణ పార్టీ నేతలతో మరోసారి చంద్రబాబు సమగ్ర ప్రణాళికా వ్యూహంతో భేటీ కాబోతున్నారు. ప్రస్తుతం తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి స్థానం ఖాళీగా ఉంది. అధ్యక్షుడిని నియమించడంతోపాటు పార్టీని ముందుకు తీసుకువెళ్లేందుకు దిశానిర్దేశం చేయనున్నారు. అవసరమైతే తనతో నిరంతరం టచ్ లో ఉండాలని, పార్టీ వ్యవహారాలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసేందుకు ఓ ఇన్ ఛార్జిని కూడా నియమిస్తానని చెప్పినట్లు తెలుస్తోంది.

## కాంగ్రెస్‌తో టచ్‌లో..
## 10 మంది

**హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల పర్వం మొదలుకానుంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ శాసన సభ్యులు కాంగ్రెసలోకి వెళ్లేందుకు మంతనాలు ప్రారంభించారు. వచ్చే ఐదేళ్ల పాటు సౌకర్యంగా ఉండే ఆలోచనతో కొందరు పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అధికార పార్టీ ముఖ్యులతో అంతర్గత సంప్రదింపులు, చర్చలు సాగిస్తున్నారు. అటునుంచి అనుమతి లభించినదే తడవుగా జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇలా 10 మందికి పైగా గులాబీ ఎమ్మెల్యేలు కాంగ్రెసతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. వీరంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో చర్చల్లో ఉన్నారు. అంతా బాగుంటే ఈ నెలలోనే భారీగా మార్పులు ఉండొచ్చని తెలుస్తోంది. వాస్తవానికి ఇలాంటివారిని ఉద్దేశించే సీఎం రేవంత్ బుధవారం నర్మగర్భ వ్యాఖ్యలు చేశారని చెబుతున్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నేతలు, ఎమ్మెల్యేల ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని, కమలం పార్టీకి ఓట్లు మళ్లేలా చేయడంతో ఏడు ఎంపీ సీట్లలో బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ లాంటి పార్టీలో కొనసాగే విషయమై 'ఆత్మప్రబోధానుసారం' నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కాగా.. 'మరికొద్ది నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇచ్చేది నేనే' అంటూ ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చెప్పుకొంటున్నారు. ఆయన కాంగ్రెసలోకి వెళ్తారని అందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇలాంటివారు 10 మందిపైగా కాంగ్రెసతో టచ్‌లో ఉన్నారని తెలిసింది. కాగా, ఎవరిని తీసుకోవాలి? ఎవరిని తీసుకోవద్దు? అనే అంశంపై సీఎం రేవంత్ స్పష్టతతో ఉన్నారు. అందరినీ చేర్చుకుంటూ పోతే, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారి గురించి సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని, తద్వారా చెడ్డ పేరు వస్తుందని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెసలోకి మారే యోచనలో ఉన్న ఎమ్మెల్యేల్లో ఎక్కువమంది జీహెచ్ఎంసీకి చెందినవారే. టీడీపీలో ఉండగా రేవంత్‌తో కలిసి పనిచేసి, బీఆర్ఎసలోకి వెళ్లినవారు, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎసలోకి మారినవారు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 39 సీట్లు నెగ్గగా అందులో 16 జీహెచ్ఎంసీ పరిధివే. వీరిలోనే కొంతమంది కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. నెలాఖారుకల్లా వీరు పార్టీ మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.

**ఇప్పటికే ముగ్గురు జంప్!**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఇప్పటికే కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం) కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాషగౌడ్ సీఎం రేవంత్‌ను కలిసినా.. ఆ తర్వాత వెనక్కుతగ్గారు. ఇదే సమయంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి (దుబ్బాక), సునీతాలక్ష్మారెడ్డి (నర్సాపూర్), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), కె.మాణిక్‌రావు (జహీరాబాద్) కూడా సీఎంను కలిశారు. వీరు కాంగ్రెసలోకి వెళ్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, వారు ఖండించారు. అభివృద్ధి పనుల కోసమే సీఎం వద్దకు వెళ్లినట్లు చెప్పారు. కాగా, పార్లమెంటు ఎన్నికలు రావడంతో దాదాపు మూడు నెలలుగా ఫిరాయింపులు ఆగాయి. ఎమ్మెల్యేలు చడీ చప్పుడు చేయలేదు. ఇప్పుడు ఎన్నికలు ముగియడంతో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా కూడా ఉన్న సీఎం రేవంత్ నుంచి అనుమతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, దీనిపై వేం నరేందర్‌రెడ్డి కాస్త చొరవ తీసుకుంటున్నారు. కాంగ్రెసలో చేరే యోచన ఉన్న ఎమ్మెల్యేలు వీరిద్దరితో పాటు ఇతర కీలక నేతలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నారు. బీఆర్ఎసలో ఉంటే నియోజకవర్గ అభివృద్ధికి పెద్దగా నిధులు అందవని భావిస్తున్నారు. దీని బదులు అధికార పార్టీలో చేరి సౌకర్యంగా ఉండొచ్చన్న ఆలోచన చేస్తున్నారు.

## ఉత్సాహంగా అర్బన్ బ్యాంక్ పోలింగ్

సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో ప్రధాన ఘట్టం ముగిసింది. గురువారం ఎంతో సందడిగా ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 2.45 గంటల వరకు పోలింగ్ జరిగింది. అనంతరం ఎంతో ఉత్కంఠతగా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. 12 డివిజన్లలో 61 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. నువ్వా నేనా అన్నట్లుగా ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి ముమ్మర ప్రయత్నం చేశారు. పోలింగ్ సమయంలో కూడా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ ఓటింగ్ పూర్తయ్యే వరకు కేంద్రాల వద్ద అభ్యర్థుల మద్దతుదారులు సందడి చేశారు. కౌంటింగ్ పూర్తయి క్యాంపునకు తరలివెళ్లే క్రమంలో డైరెక్టర్లను కిడ్నాప్ చేసే యత్నం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు లాఠీలు ఝులిపించి చెదరగొట్టడంతో ఉద్రికత్తకు దారి తీసింది. పోలీసులు చెదరగొట్టడంతో పలువురికి స్వల్పంగా దెబ్బలు తగలడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు వివిధ పార్టీల కార్యకర్తలను సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. కౌంటింగ్ సమయంలో నాలుగో వార్డుకు సంబంధించి అడ్డగట్ల మురళికి 190 ఓట్లు, సూరం వినయ్‌కు 186 ఓట్లు వచ్చాయి. నాలుగు ఓట్లు తేడా ఉండడంతో వినయ్ రీకౌంటింగ్ కోరారు. ఆలస్యంగా రీకౌంటింగ్ కోరారనే దానిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, సహకార అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు రీకౌంటింగ్‌కు ఆమోదించారు. ఒకవైపు రీకౌంటింగ్‌పై ఎన్నికల అధికారి ముందు వాగ్వాదం జరుగుతుండగానే ఫిర్యాదు చేసిన అభ్యర్థి రీకౌంటింగ్‌లో ఓట్లు సరిచూసుకొని సరిగ్గా ఉన్నాయని తెలపడం గమనార్హం. దీంతో అడ్డగట్ల మురళి గెలుపొందినట్లుగా ప్రకటించారు.

**బీఆర్ఎస్ ప్యానెల్‌దే హవా...**

సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ పాలకవర్గంలో మరోసారి పాగా వేయడానికి బీఆర్ఎస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభ్యర్థులకు మద్దతు పలికింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటోలతో ప్రచారం నిర్వహించారు. అర్బన్ బ్యాంక్ పరిధిలో 12 డివిజన్లలో బీఆర్ఎస్ మద్దతు పలికిన అభ్యర్థుల్లో ఎనిమిది మంది గెలుపొందారు. వీరితో పాటు పాటు స్వతంత్రులుగా గెలిచిన వారు కూడా వీరికి మద్దతుగానే ఉన్నట్లుగా తెలిసింది. బీఆర్ఎస్ మద్దతుదారుల్లో రాపెల్లి లక్ష్మీనారాయణ, అడ్డగట్ల మురళి, పాటి కుమార్‌రాజు, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాస్, ఎనగందుల శంకర్, కోడం సంజీవ్‌లు గెలుపొందారు.

# పోలీసుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం







**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మారుమూల గ్రామాల పేదల ఆరోగ్య రక్షణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు ఎస్పి సురేందర్ రావ్ అన్నారు. మండలంలోని సూర్య గూడా గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవలు అందించేందుకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉన్నారన్నారు. పలు వ్యాధులతో బాధపడుతూ వైద్య సేవలు అందుకోలేకపోతున్న పేదల కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన గ్రామాల్లో గిరిజనులు అనారోగ్యానికి గురైతే నాటు మందులు వాడి ప్రాణాలు మీదకు తెచ్చుకోవద్దన్నారు.దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ నరేందర్ రాథోడ్, ఉట్నూర్ డిఎస్పి నాగేందర్, వర్టికల్ డిఎస్పి శ్రీనివాస్, సైబర్ క్రైమ్ డిఎస్పి హసిబుల్లా, ఇచ్చోడ సీఐ భీమేష్, మండల వైద్యాధికారి శ్యాంసుందర్, గుడిహత్నూర్ ఇంద్రవెల్లి, నేరడిగొండ, ఎస్సైలు సయ్యద్ ఇమ్రాన్, సునీల్, శ్రీకాంత్, రిమ్స్ వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి






**– పాలనాధికారి రాజర్షి షా**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టే పనులు నాణ్యత ప్రమాణాలతో కూడుకొని ఉండాలని, పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పాలనాధికారి రాజర్షి షా తన అధికారులకు ఆదేశించారు. గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, స్కూల్ యూనిఫాం తయారీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కల్పన లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న త్రాగునీరు, టాయిలెట్స్, మైనర్ రిపేర్, మేజర్ రిపేర్, బాలికల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్స్, విద్యుత్ వంటి పనులను ఇప్పటివరకు ఎన్ని పూర్తయినవి, ఇంకా ఎన్ని పనులు చేపట్టవలసి ఉన్నని, ఎప్పటిలోగా పూర్తి చేస్తారని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికలు రూపొందించుకొని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో సమూలమైన మార్పులు తెచ్చేందుకు చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను లక్ష్యంగా నిర్దేశించుకుని స్కూల్ తెరచే లోపు పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతతో చేయించాల్సిన బాధ్యత ఆయా యజమాన్యాలపై ఉందని అన్నారు. నిధుల అందుబాటు లో ఉన్నాయని, ఎలాంటి నిధుల కొరత లేనందున త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టకముందు, పనులు చేపట్టిన తర్వాత ఫోటోలు పంపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని,విద్యార్థులకు యూనిఫామ్ లను పాఠశాల పునః ప్రారంభం కావడానికి ముందే యూనిఫాం లు ఆయా పాఠశాలలకు సకాలంలో అందించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్కూల్ యూనిఫామ్ లు కుట్టే బాధ్యత స్వయం సహాయ సంఘాల కు అప్పగించడం జరిగిందని ,ఇప్పటివరకు ఎన్ని జతల యూనిఫామ్ లను సిద్ధం చేశారని,ఇంకా ఎన్ని జతల బట్టలు కుట్టవలసి ఉందని,మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయా అని, ప్రతిరోజు సగటున ఎన్ని యూనిఫామ్ లు తయారు చేస్తున్నారని తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా యూనిఫాంలో తయారీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. యూనిఫాం ల తయారీ కి సంబంధించిన నివేదికను రోజువారీగా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అధికారి ప్రణీత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన కొండా విశ్వేశ్వర్ రెడ్డిని సన్మానించిన మైనార్దేపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి.



**పద్మక్రాంతి,( రాజేంద్రనగర్ ప్రతినిధి):** భాగంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుండి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి బిజెపి పార్టీ నుంచి కొండ విశ్వేశ్వర్ రెడ్డి కోటి చేయడం జరిగింది.ఇరువురి మధ్య తీవ్రమైన పోటీ కరిగిన ,ప్రజలు ఆశించిన ఫలితాలు తారుమారు అయ్యాయి.గెలుపు రంజిత్ రెడ్డి, కొండ విశ్వశియ రెడ్డిదా, అన్న టెన్షన్ ప్రజలకు పట్టుకుంది. నాలుగో తేదీ కౌంటింగ్ ఎప్పుడు వస్తుంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి ఎప్పుడు చేవెళ్ల గడ్డపై విజయ బహుట ఎగురవేస్తారని కాంగ్రెస్ పార్టీ నేతలు కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూశారు. తీరా నాలుగో తేదీ కౌంటింగ్ తేదీ రానే వచ్చింది ఇక మా నేత గెలుపును ఎవరు అడ్డుకోలేరని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు జిల్లా నేతలు అనుకుంటున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డికి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. మొదట్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ చూపించినప్పటికీ, రాను రాను బ్యాలెట్ బాక్సులు ఓపెన్ చేస్తున్న తరుణంలో రంజిత్ రెడ్డి వెనుకంజ వేసి కొండ విశ్వేశ్వర్ రెడ్డి మెజార్టీ దిశలో కొనసాగారు. ఈ విషయం ఎవరు ఊహించలేని విధంగా ఫలితాల వివరాలు తలకిందులు అయ్యాయి. తెలంగాణ పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయంక మోగిస్తుందని ప్రజలంతా ఆశించారు కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్ని స్థానాలకే పరిమితం అవ్వగా బిజెపి ఎన్ని స్థానాలకు పరిమితమైంది ఇక మిగిలిన ఒక్క పాత బస్తి ఎంపీ సీటును అసదుద్దీన్ ఓవైసీ ఎన్నో సంవత్సరాలుగా గెలుపొందుతూ తన సత్తాను చాటడం పరిపాటుగా మారింది. చేవెళ్ల ఎంపీగా బరిలో ఉన్న డాక్టర్ రంజిత్ రెడ్డి గెలుపు నల్లేరుపై నడికేనని ప్రజలంతా భావించారు ఎందుకంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఇది సామాన్యమైన కాంగ్రెస్ గెలుపుగా ప్రజలంతా విశ్వసించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశలను తలకిందులు చేసి చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపొందడం అందరిని విస్మయానికి గురిచేసింది. అన్నా నాకు ఈ అవసరం ఉంది అని వస్తే ఒక ఎంపీగా నేనున్నా తమ్ముడు అంటూ ధైర్యం చెప్పి వారి సమస్యలు తీర్చిన రంజిత్ రెడ్డి ఈ ఎంపీ ఎన్నికల్లో ఓడిపోవడం తనను బాధకు గురిచేస్తుంది అని ఆయన అభిమానులు కార్యకర్తలు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా పార్టీల మధ్య గెలుపు ఓటమిలు సహజం తప్ప ప్రజలు ఇచ్చిన తీర్పును ఎవరైనా శిరసావహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు అంటున్నారు. కొండా విశ్వేశ్వర రెడ్డిని సన్మానించిన కార్పొరేటర్ తోకల.రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని కాంటెస్టెడ్ మ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి మైలర్ దేవ్ పల్లి డివిజన్ నుంచి డివిజన్ ప్రెసిడెంట్ అద్వర్యం లో భారీ ఎత్తున చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల లో భారీ మెజారిటీ తో గెలుపొందిన హార్దిక శుభాకాంక్షలు తెలియజేయడానికి భారీ ఎత్తున బయదేరడం జరిగింది. సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో తో గెలుపొందిన సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డిని రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పార్టీ నాయకుల తో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందిస్తూ హార్దిక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అన్ని విధాలుగా సంస్థాగతంగా బలోపేతం, చేయడానికి భవిష్యత్తులో కూడా అందరూ కలిసి కట్టుగా సమిష్టిగా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని తెలియజేస్తూ అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

## పుట్టినరోజు సందర్భంగా బస్ షెల్టర్ ఏర్పాటు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** బోథ్ కి చెందిన మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా పుట్టిన రోజు సందర్భంగా వృధాగా ఖర్చు చేయకుండా ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ ను నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టినరోజు సందర్భంగా ఎవరు కూడా డబ్బులు వృధా చేయకుండా తమకు తోచిన విధంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గ కమిటీ అధ్యక్షుడు పాలిక్ రమేష్, విద్యార్థి అధ్యక్షుడు పుంద్రు రాకేష్ రెడ్డి, మెరుగు సాయి, బీజేపీ నాయకుడు వోటకరి సాయి రోహిత్, చాట్ల రాము, మాసం అరవింద్, వినీల్ ఇప్ప, ముత్యం, సన్నీ, ఆదర్శ పాఠశల సిబ్బంది, సైనిక్ యూత్ సభ్యులు,ఆలంబన వెల్ఫేర్ సొసైటీ సభ్యులు,విద్యార్థి యూత్,సాయినగర్ ప్రజలు,మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలి

**వాస్తవ నేస్తం,భీంపూర్:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన అందుతుందని,తల్లితండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పిప్పల్ కోటి గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి బడి బాట కార్యక్రమం నిర్వహించి, బడి బాట ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు శ్యాంసుందర్, మహేశ్వర రావ్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్త వెంకటమ్మ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండలంలోని కలకోట, బ్రాహ్మణపల్లి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ సిబ్బందితో కలిసి గురువారం ఉదయం బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల ఆరో తేదీ నుంచి పంధొమ్మిదో తేదీ వరకు ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను రోజువారి కార్యక్రమ లక్ష్యాల సాధన దిశగా సిబ్బందితో కలిసి అంతా కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పాఠశాలలకు మౌళిక వసతులును కల్పిస్తూ మెరుగైన ఫలితాలు సాధనలో చేయూత నిస్తుందన్నారు. మండలంలోని ప్రాథమికొన్నత పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అనుభవంగల అధ్యాపకులచే అందించుటం జరుగుతుందన్నారు, విద్యార్థుల సంఖ్యను పెంచుటగాను, బడి ఈడు పిల్లలను చేర్పించుటకు గ్రామంలోని మహిళా సంఘాలు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కొంత కాలంగా డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. బోధన అభ్యసన ప్రక్రియలో బట్టి కొట్టే విధానం కాకుండా పరిశీలనతొ కూడిన వృత్యంతర గుణాత్మకమైన విద్యను అందించుటకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలకోట బ్రాహ్మణపల్లి ప్రధానోపాధ్యాయులు సునీల్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, జ్ఞానీ, నాగేశ్వరావు, సురేష్ బాబు, సంగీత సునీత, సుజాత, కోటేశ్వరరావు, మంగతాయారు, రామకృష్ణ, బేబీ, అంగన్వాడీ లు, ఎఫర్ట్ సంస్థ బాద్యులు మౌనిక, కావేరి, తదితరులు పాల్గొన్నారు.

## పీటర్ నాయక్ లకావత్ కు ఐకానిక్ పీస్ అవార్డ్






**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** సమాజ సేవకులు పీటర్ నాయక్ లకావత్ కు ఐకానిక్ పీస్ అవార్డ్ వరించింది. మానవ హక్కుల పోరాటం సామాజిక సేవలో ఐకానిక్ పీస్ అవార్డ్ కౌన్సిల్ సంస్థ సమాజ సేవకులకు, మానవహక్కుల పరిరక్షణ కోసం కృషి చేసే వారికి అవార్డులు ప్రధానం చేస్తుంది. ఈ సందర్భంగా పీటర్ నాయక్ సామాజిక సేవను గుర్తించి ఐకానిక్ పీస్ అవార్డ్ ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పీటర్ నాయకులు పలువురు ప్రశంసించారు. తనను ప్రోత్సహించిన ఐకానిక్ పీస్ అవార్డ్ కౌన్సిల్ సంస్థ సభ్యులకు డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తుంది అని ఎంపీడీవో లక్ష్మన్ అన్నారు. గురువారం మండలంలోని సాత్ నంబర్, అడేగాం గ్రామాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి అనంతం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామస్తులు ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మైక్ మెకానిక్ షాపులో అగ్ని ప్రమాదం



**మేడ్చల్ :** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ మెకా నిక్ షాప్ లో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద అర్జున్ చౌహన్ బైక్ పాయింట్ లో అగ్నిప్రమాదం సంభవించింది. దీని గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 18 బైకుల వరకు దగ్ధమయ్యాయని షాప్ యజమాని తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియ రాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com